విక్రమ్-1 విజయగాథలో సిరిసిల్ల యువతేజాలు..



# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ సోమవారం, 20 జూలై-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

# బహదూర్ గూడలో మరోసారి ఉద్రిక్తత..

- అర్ధరాత్రి వేళ రైతులను అరెస్టు చేసి, ఫెన్సింగ్ ఏర్పాటు



**హైదరాబాద్, జూలై 19 :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామంలో అర్ధరాత్రి మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీక్ష నిర్వహిస్తున్న బహదూర్‌గూడ రైతులను అర్ధరాత్రి వేళ అదుపులోకి తీసుకున్నారు. మహేశ్వరం పోలీస్ స్టేషన్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో తిప్పి.. చివరకు తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో వదిలేశారు. అదే సమయంలో రైతులు నిర్వహిస్తున్న దీక్షాస్థలంలో ఏర్పాటు చేసిన టెంట్‌ను పూర్తిగా తొలగించి, ఫెన్సింగ్ వేశారు.ఇదిలా ఉంటే.. బుల్లెట్ ట్రైన్ హబ్ కోసం బహదూర్‌గూడ గ్రామంలోని సర్వేనంబర్ 28లో 150 ఎకరాలు, సర్వేనంబర్ 62లో 500 ఎకరాలను మొత్తంగా 650 ఎకరాలకు సంబంధించి శనివారం జరిగిన భూసేకరణ ప్రక్రియ పోలీసుల అత్యుత్సాహంతో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. శాంతియుతంగా నిరసన చేపడుతున్న రైతులు, గ్రామస్తులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. వారిని అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేయడంతో ఒక్కసారిగా పోలీసులకు, రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకొన్నది. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గాల్లో పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేశారు. భూసేకరణను వ్యతిరేకిస్తూ రైతులు నినాదాలు చేస్తూ అధికారులను నిలదీశారు. అధికారులు, రైతుల మధ్య వాగ్వాదం

మిగతా 4లో..

## సాగునీటి సంస్థల బలోపేతానికి
# కొత్త కార్యాచరణ

- 10 రోజుల్లో ఫండింగ్ రోడ్‌మ్యాప్: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, జూలై 19:** రాష్ట్రంలోని సాగునీటి సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు అధిక వడ్డీ రుణాల భారాన్ని తగ్గించి... తక్కువ వడ్డీతో నిధులు సమీకరించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం కుందన్‌బాగ్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సాగునీటి సంస్థల ఆర్థిక పరిస్థితిపై నిర్వహించిన ప్రత్యేక సమీక్షలో ఆయన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వచ్చే పది రోజుల్లో సమగ్ర ఫండింగ్ రోడ్‌మ్యాపను సిద్ధం చేసి సమర్పించాలని... బడ్జెట్ నిధులపై పూర్తిగా ఆధారపడకుండా సంస్థలకు స్థిరమైన ఆదాయ వనరులను అభివృద్ధి చేసే మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు. రుణాల పునర్వ్యవస్థీకరణ ద్వారా అధిక వడ్డీ భారాన్ని తగ్గిస్తే ప్రభుత్వానికి భారీగా ఆదా అవుతుందన్నారు. సాగునీటి సంస్థల ఆధీనంలోని భూముల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని, రైతులపై అదనపు భారం లేకుండా కొత్త ఆదాయ వనరులను సృష్టించాలన్నారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన

మిగతా 4లో..

## సీఎం రేవంత్‌రెడ్డి వల్లే
# కరువొచ్చింది

- భద్రాచలం మునక పేరిట ప్రజలను తప్పుదోవ
- కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయాలు వద్దు..
- మోటర్లు ఆన్‌చేసి రిజర్వాయర్లు నింపాలి
- పాదయాత్రలో హరీశ్ రావు డిమాండ్
- కాంగ్రెస్ సర్కార్‌పై కదంతొక్కినరైతులు
- సాగునీటి కోసం మహా పాదయాత్ర
- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో



రైతుల మహా పాదయాత్ర

**సిద్దిపేట, జూలై 19 :** 'రాష్ట్రంలో ప్రస్తుత కరువు సహజసిద్ధంగా రాలేదు. ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే. ప్రకృతి తెచ్చింది కానేకాదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెచ్చిన కరువు. ప్రభుత్వం సమయానికి కాళేశ్వరం నీళ్లు ఎత్తకపోవ డం వల్లే ఈ పరిస్థితి దాపురించింది' అని బీఆర్‌ఎస్ శాసనసభా పక్ష ఉపనేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శిం చారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను ఎత్తి తెలంగాణ రైతులకు అందించారని

మిగతా 4లో..

# బంగాళా ఖాతంలో అల్పపీడనం..



- పుంజుకోనున్న రుతుపవనాలు

**హైదరాబాద్, జూలై 19 :** రుతుపవన ద్రోణి శ్రీగంగానగర్, రోహతక్, హర్దోయ్, వారణాసి, రాంచీ, సాగర్ ద్వీపం మీదుగా ఆగ్నేయ దిశగా వాయువ్య బంగాళాఖాతం వైపునకు వెళుతూ సముద్ర మట్టానికి 1.5 కి.మీ. ఎత్తువరకు విస్తరించి ఉన్నదని, దీని ప్రభావంతో రాబోయే వారం రోజులు రాష్ట్రవ్యాప్తంగా కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు మళ్లీ పుంజుకోనున్నాయని వెల్లడించింది. కొన్ని వారాలుగా మైదాన ప్రాంతాలు ఎండలతో ఉడికిపోగా, వర్షాలు కేవలం హిమాలయ పర్వత ప్రాంతాలకే పరిమితమయ్యాయి. రుతుపవనాలు దేశవ్యాప్తంగా మళ్లీ బలపడనున్నాయని, వచ్చేవారం ప్రారంభంలో ఈశాన్య భారతదేశం నుంచి మొదలై క్రమంగా తూర్పు, మధ్య, ఉత్తర భారతదేశానికి విస్తరించనున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. వాతావరణ నిపుణుల ప్రకారం.. భారతదేశం ప్రస్తుతం 'బ్రేక్ మాన్‌సూన్' దశను ఎదురొన్నది. ఈ సమయంలో వర్షాలు కురిపించే ద్రోణి ఉత్తర హిమాలయాల వైపు వెళ్లడం వల్ల మధ్య భారతదేశం పొడిబారిపోయింది. ఈ నెలలో బంగాళాఖాతంలో అతి తకువ అల్పపీడనాలు ఏర్పడటం, అరేబియా సముద్రపు గాలులు బలహీనపడటమే దీనికి కారణం. ఫలితంగా దేశవ్యాప్తంగా వర్షపాతంలో ఇప్పటివరకు 24 శాతం లోటు నమోదైంది. కురువాల్సిన 323.1 మి.మీ వర్షపాతానికిగాను కేవలం 244.6 మి.మీ నమోదైంది.

# నిజామాబాద్ జిల్లాలో హై టెన్షన్..



- కాంగ్రెస్ నేత వినయ్ రెడ్డి హౌస్ అరెస్ట్

**నిజామాబాద్ జిల్లా, జులై 20 :** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలో రాజకీయ ఉద్రిక్తత నెల కొంది. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలు ఈరోజు(సోమవారం) పోటాపోటీ కార్యక్రమాలతో అంకాపూర్ గ్రామం హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆయన నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. అంకాపూర్‌లోని బీజేపీ ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమవుతుండగా, వచ్చిన వారికి సమాధానం చెప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామని బీజేపీ నాయకులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి కూడా అంకాపూర్‌లోని తన నివాసం లోనే ఉంటానని స్పష్టం చేశారు.రెండు పార్టీల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉండటంతో

మిగతా 4లో..

# హైడ్రాతో కుంటుపడిన నగర ప్రగతి :



## బీజేపీ

**హైదరాబాద్, జూలై 19 :** హైడ్రాతో నగర ప్రగతి కుంటుపడిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆం దోళన వ్యక్తం చేశారు. ఆదివారం హైద రాబాద్ జిల్లా పరిధిలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా 4లో..

## బీఆర్‌ఎస్‌కు
# మల్లారెడ్డి గుడ్‌బై?

- కార్యక్రమాలకు హాజరుకాని మేడ్చల్ ఎమ్మెల్యే
- 18న ఘట్‌కేసర్‌లో సీఎం సభకు హాజరు
- కేసీఆర్ కుటుంబంపై రేవంత్ విమర్శలు
- సభ ముగిశాకైనా ఖండించని మాజీ మంత్రి
- సోషల్ మీడియాలో బీఆర్‌ఎస్ శ్రేణుల ఫైర్
- పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్



**హైదరాబాద్, జూలై 19:** బీఆర్‌ఎస్ కీలక నేత, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లా రెడ్డి.. ఆ పార్టీని వీడతారంటూ కొన్నాళ్లుగా జరుగుతున్న చర్చ తాజాగా ఊపందుకుంది. కొంతకాలంగా బీఆర్‌ఎస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న మల్లారెడ్డి.. ఈ నెల 18న ఘట్‌కేసర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సభకు హాజరు కావడమే ఇందుకు కారణం. అంతేకాదు..

మిగతా 4లో..

# రాజకీయాలపై కార్టూన్లు చూపే ప్రభావం ఎంతో గొప్పది

- కార్టూనిస్ట్ శేఖర్ స్మారక అవార్డులు కళాకారులకు స్ఫూర్తి.. : కేటీఆర్



**హైదరాబాద్, జూలై 19 :** రాజకీయ జీవితంలో ప్రతిరోజూ విమర్శలు, ప్రతి విమర్శల మధ్య గడుపుతున్న తమకు ఇలాంటి ఆహ్లాదకరమైన సాహిత్య, కళా వేదికల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కళాకారులు, రచయితలు, కవులు, చిత్రకారులతో మమేకమయ్యే అవకాశాలు అరుదుగా వస్తాయని, అలాంటి సందర్భాలు పాత జ్ఞాపకాలను, ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తాయని చెప్పారు. ప్రముఖ కార్టూనిస్ట్ శేఖర్ స్మారకార్థం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డ్స్ 2026 ప్రదానోత్సవ సభ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలు అందజేశారు. కార్టూన్ విభాగంలో కార్టూనిస్ట్ ఎం. నారు, ఆర్టిస్టు విభాగంలో చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్ అవార్డులు ందుకున్నారు.ఈ సందర్భంగా కార్టూనిస్టుల పాత్రపై మాట్లాడిన కేటీఆర్..

మిగతా 4లో..

# స్పెయిన్ అద్భుత విజయం



**హైదరాబాద్, జూలై 19:** గోల్ ఇవ్వలేదు.. గెలుపు వదల్లేదు.. కట్టుదిట్టమైన డిఫెన్స్, వేగవంతమైన దాడులతో అర్జెంటీనాను పూర్తిగా కట్టడి చేసిన స్పెయిన్ ప్రపంచకప్‌పై మరోసారి తన ముద్ర వేసింది. స్టార్ల మెరుపుల కంటే సమష్టి స్ఫూర్తే గొప్పదని స్పెయిన్ మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. మెస్సి మాయను మసకబార్చింది.. అర్జెంటీనా ఆశలను ఆవిరి చేసింది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను మట్టికరిపించి ప్రపంచకప్‌ను రెండోసారి కైవసం చేసుకుంది. సోమవారం తెల్లవారుజామున ముగిసిన ఫైనల్లో అదనపు సమయంలో నమోదైన ఏకైక గోల్‌తో స్పెయిన్ 1-0 తేడాతో విజయం సాధించి జగజ్జేతగా నిలిచింది. ఫెరాన్ టోరెస్ (106వ నిమిషం) చేసిన గోల్ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించిందిమ్యాచ్ ఆరంభం నుంచే స్పెయిన్ బంతిపై పూర్తి ఆధిపత్యం చెలాయించింది. మిడ్‌ఫీల్డ్‌లో రోడ్రి ఆటను చక్కగా నడిపించగా.. యమాల్, ఒల్మో, నికో విలియమ్స్ వరుస దాడులతో అర్జెంటీనా డిఫెన్స్‌లో పడేలా చేశారు.

# పట్టణాలకు లక్ష ఎల్ఐజీ ఇండ్లు..

- నేడు దరఖాస్తు విధానం, అర్హతలు వెల్లడి



**హైదరాబాద్, జూలై 19 :** ఈ ఆర్థిక సంవత్సరంలోనే రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపడతామని, హైదరాబాద్ నగరంతోపాటు పట్టణ ప్రాంతాల్లో ఎల్ఐజీ తరహాలో ఇండ్లు మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడి వెల్లడించారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర సచివాల యంలో దరఖాస్తు విధానం, అర్హతలపై బ్రోచ ర్‌ను విడుదల చేస్తామని మంత్రి

మిగతా 4లో..

# పోతుగల్ గ్రామంలో లబ్ధిదారులకు ప్రభుత్వ చెక్కుల పంపిణీ



**రాజన్న సిరిసిల్ల, జూలై -18**
రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పోతుగల్ గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ పేర్కొన్నారు. నేడు పోతుగల్ గ్రామంలో లబ్ధిదారులకు ప్రభుత్వ చెక్కులను సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మొత్తం రూ. 2,06,000 విలువైన చెక్కులను 9 మంది లబ్ధిదారులకు అందజేశారు.

లబ్ధిదారులు – వారికి అందిన సహాయం వివరాలు: బండారి బాలయ్య: రూ. 40,000, పుట్ట లక్ష్మి: రూ. 25,000, వంగ లక్ష్మి: రూ. 25,000, జంగ రాజ నర్సమ్మ: రూ. 24,500, నీరటి చంద్రయ్య: రూ. 22,500, అనమేని లక్ష్మి: రూ. 22,000, వంగపల్లి బాలయ్య: రూ. 20,500, చెప్పాల రేఖ: రూ. 20,000, తలారి మణమ్మ: రూ. 6,500, ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే లక్ష్యమని, లబ్ధిదారులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోతుగల్ గ్రామ శాఖ అధ్యక్షుడు అనేమేని రాజు, కేశిగాని రాజయ్య,కాంగ్రెస్ పార్టీ ఎన్ఆర్ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, నాయకులు మెరుగు కిరణ్, మామిండ్ల ఆంజనేయులు, మాచర్ల బాలయ్య, రవి, అనమేని అంజయ్యలతో పాటు గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీళ్లు లేవు




**తాగునీటికీ ఇబ్బందులు తప్పవు!**

**ఆరుతడి పంటలే సాగు చేయండి**

**కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**

**మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం హాజరు**

**కరీంనగర్ కలెక్టరేట్, జూలై 19:** రాష్ట్రంలో రానున్న రోజుల్లో తాగునీటికీ ఇబ్బందులు తప్పవని, నీటి వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. ఎల్ నినో ప్రభావం అన్నిరంగాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నదని, ఇప్పటికే భూగర్భజలాలు పాతాళానికి పడిపోయినట్టు చెప్పారు. రాష్ట్రంలోని సాగర్, ఎస్సారెస్పీ తదితర ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు డెడ్‌స్టోరేజీకి పడిపోయాయని తెలిపారు. ఈ మేరకు ఎల్ నినో ప్రభావ తీవ్రతపై అవసరమైన ప్రణాళికలు రూపొందించే క్రమంలో ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అయిన ఆయన ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

# రాష్ట్రంలో కొత్త పథకం.. రేపే ప్రారంభం..




**హైదరాబాద్, జూలై 19:** రాష్ట్రంలోని పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే పథకాన్ని పట్టణాల్లోని పేదలకు వర్తింపజేస్తోంది. పట్టణాల్లోని తక్కువ ఆదాయ వర్గాల( కోసం ఇందిరమ్మ ఇళ్లు- ఎల్ఐజీ హౌసింగ్ టవర్స్ పథకాన్ని జూలై 20 సోమవారం రోజున ప్రారంభించనుంది. హైదరాబాద్ లోని క్యూఆర్(కోర్ అర్బన్ రీజియన్) లో మొదలయ్యే ఈ పథకం ద్వారా ఆధునిక అపార్ట్ మెంట్ తరహా గృహాలను అందుబాటులోకి తీసుకొస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ మేరకు దరఖాస్తు విధానం, అర్హతలను త్వరలోనే ప్రకటించనుంది. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక లక్ష ఇళ్లను నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తొలి దశలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి కనీసం 500 నుండి 1000 ఇళ్లను కేటాయించనుంది. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి అధికారులు పనులను వేగవంతం చేయనున్నారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా.. నిర్ణీత సమయంలోనే ఇళ్లను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మరోవైపు క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ ఐజీ ఇళ్ల కార్యక్రమాన్ని సోమవారం సచివాలయంలో ప్రారంభించనున్న నేపథ్యంలో ఉన్నతాధికారులతో గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇవాళ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సొంతింటిని నిర్మించి అందిస్తామని తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. ఆ సంకల్పంతోనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో 100శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తూ పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఈ విడతలో హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 50 వేల ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటివరకూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టిందని ఇప్పుడు హైదరాబాద్ తో పాటు పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న పేదల సొంతింటి కలను సాకారం చేయబోతుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు

# సిద్ధంగా ఉండాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి
- జిల్లాల వారీగా ఎల్‌నినో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి
- ఇన్‌చార్జి మంత్రుల సమీక్షలకు శాఖల వారీ సమగ్ర నివేదికలతో హాజరుకావాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్





**రాజన్న సిరిసిల్ల, జూలై -18**
ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి సూపర్ ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ నివారణ చర్యలు, వ్యవసాయ ప్రణాళికలు, తాగునీటి నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి శాఖల వారీగా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని, తక్కువ నీటి అవసరమయ్యే పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవసరమైన విత్తనాలు, సాంకేతిక సూచనలు అందుబాటులో ఉంచి రైతులకు అన్ని విధాలుగా సహకరించాలని తెలిపారు.ప్రతి జిల్లా ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని, తాగునీటి సరఫరా, వ్యవసాయం, పశుసంవర్ధక, విద్యుత్, వైద్య, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ప్రత్యేక అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశాలకు అన్ని శాఖల అధికారులు సూపర్ ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం అంచనాలు, వ్యవసాయ పరిస్థితులు, తాగునీటి నిర్వహణ, శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలపై సమగ్ర నివేదికలతో హాజరుకావాలని ఆదేశించారు.

### పూర్తి వివరాలతో హాజరు కావాలి

జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ప్రత్యేక అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశాలకు ఆయా శాఖల అధికారులు పూర్తి వివరాలతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యానవన, నీటి పారుదల, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ, పశు సంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ ఇతర శాఖల అధికారులు పక్కా ప్రణాళిక ప్రకారం వివరాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఎన్ పీడీసీ ఎల్ ఎస్ఈ వేణుమాధవ్, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- తాగునీటికి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- నీటి పారుదల శాఖ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ సమీక్ష



**రాజన్న సిరిసిల్ల, జూలై -18**
రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై నీటి పారుదల శాఖ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... జిల్లాలోని ఎగువ మానేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం రెండు టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.612 టీఎంసీల నీరు ఉందని వెల్లడించారు. అలాగే మల్కపేట రిజర్వాయర్ ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం మూడు టీ ఎం సీ లు కాగా, ప్రస్తుతం 1.33 టీఎంసీల నీరు ఉందని, అన్నపూర్ణ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 3.50 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.45 టీఎంసీల నీరు ఉందని, మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 27.55 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.44 టీఎంసీల నీరు ఉందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో ఇప్పటివరకు లోటు వర్షపాతం నమోదు అయిందని వెల్లడించారు. ఎగువ నుంచి రిజర్వాయర్లకు వరద రావడం లేదని, ప్రస్తుతం రిజర్వాయర్లలోని నీటిని తాగునీటి కోసం ఉపయోగించాలని స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులతో జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు ఎక్కువగా లేవని తెలిపారు. దీంతో ఆయా రిజర్వాయర్లు, చెరువులు, కుంటల కింద సాగునీరు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని వివరించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పిలుపు నిచ్చారు.స్వల్ప కాలిక పంటలు, కూరగాయలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల పంటలు, ఆయిల్ పామ్ తదితర పంటల సాగు వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

### ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఫాం పాండ్స్, బోర్ వెల్స్ రీచార్జ్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఫాం పాండ్స్ తో రైతుల పొలాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, ఎన్నో లాభాలు ఉన్నాయని తెలియజేస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫాం పాండ్స్ ఏర్పాటు చేసుకునేలా చూడాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో బోర్ వెల్స్ రీచార్జ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. బోర్ వెల్స్ రీచార్జ్ తో భూగర్భ జలాలు పెరిగి నీటి ఇబ్బందులు దూరమవుతాయనే విషయాన్ని తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

### డ్రై డే కచ్చితంగా పాటించాలి

జిల్లాలో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని పేర్కొన్నారు. వర్షం కురిసిన మరుసటి రోజు డ్రై డే నిర్వహించాలని తెలిపారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ప్రణాళిక సిద్ధం చేయా లని ఆదేశించారు. ఒకవేళ పశువులు, మేకలు, గొర్రెలకు దానా, పశు గ్రాసం కోసం కావలసిన ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలని సూచించారు.వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తినక ముందు, తిన్న తర్వాత చేతులు కడుక్కునేలా వివరించాలని పేర్కొన్నారు. నీటిని వేడి చేసి చల్లార్చిన తర్వాత తాగేలా అవగాహన కల్పించాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, జిల్లా నీటి పారుదల దయాకర్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, నీటి పారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జలాశయాల నీటి నిల్వలపై జిల్లా కలెక్టర్ ఆరా

- తాగునీటికి ఇబ్బందులు కలగకుండా సరఫరా చేయాలని ఆదేశం



**రాజన్న సిరిసిల్ల, జూలై -18**
జిల్లాలో ఉన్న జలాశయాల ప్రస్తుత నీటి నిల్వల వివరాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆరా తీశారు. ఆయా నీటి నిల్వలను తాగు నీటికి సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సము దాయంలో నీటి పారుదల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఉన్న రిజర్వాయర్లు, వాటి స్థితిగతులపై అధికారులు మ్యాప్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు.శ్రీ రాజ రాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) తో పాటు ఎగువ మానేరు, అన్నపూర్ణ రిజర్వాయర్ల ప్రస్తుత నీటి నిల్వల స్థితిగతులను కలెక్టర్ అడిగి తెలుసుకు న్నారు.ఎస్సారెస్పీ నుండి ఫ్లడ్ ఫ్లో కెనాల్, మూలవాగు, మానేరు వాగు వరద నీటితో పాటు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును నుండి లిఫ్ట్ చేయడం ద్వారా మధ్యమానేరు జలాశయాన్ని నీటితో నింపడం జరుగుతుందని తెలిపారు. ఎగువ మానేరుకు మల్లన్న సాగర్, కూడవెల్లి, పాల్వంచ వాగుల ద్వారా నింపడం జరుగుతుందని కలెక్టర్ కు నీటి పారుదల శాఖ అధికారులు వివరించారు.జిల్లాలోని సిరి సిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు అన్ని మం డలాలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు నీటి నిల్వలపై పర్యవేక్షణ చేయాలని, అధికారులు సమ న్వయం చేసుకుని నీటి సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశిం చారు.సమీక్షలో నీటి పారుదల శాఖ ఈఈ దయాకర్, శ్రీపాద ఎల్లం పల్లి ప్రాజెక్టు ఈఈ సంతు ప్రకాష్ రావు, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ అన్వర్, ఇంట్రా ఈఈ సుమ లత, వ్యవసాయ శాఖ అధికారిణి అఫ్జల్ బేగం, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, డీఈ ప్రశాంత్, తదితరులు ఉన్నారు.



# ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి



## ఎల్లారెడ్డిపేట బీఎల్ఏ--బీఎల్వో సమావేశంలో పిలుపు..

### 100 శాతం ఓటరు నమోదు లక్ష్యం..

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**
ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ॠ×=)లో భాగంగా ఎల్లారెడ్డిపేటలో బీఎల్ఏ--బీఎల్వో సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా సమన్వయంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు, ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి భారత పౌరుడు తన ఓటు హక్కును సక్రమంగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడాలని అన్నారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రత్యేక ఓటరు సవరణ (ॠ×=) ప్రక్రియలో భాగంగా అవసరమైన దరఖాస్తు ఫారాలను సంబంధిత బీఎల్వో (దీూ) లేదా బీఎల్ఏ (దీూ) ద్వారా నింపించి సమర్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో ఒక్క అర్హుడి పేరు కూడా మిగిలిపోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎనుగందుల నరసింహులు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పరిధిలోని ఎనిమిది పోలింగ్ బూత్‌లలో బీఎల్ఏ--బీఎల్వో సమావేశాలు ఇప్పటికే 85 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన బూత్‌లలో కూడా త్వరితగతిన సమావేశాలు నిర్వహించి, ప్రతి ఓటరును చైతన్యపరుస్తూ ఓటరు నమోదును 100 శాతం పూర్తి చేయడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఉపసర్పంచ్ బంధారపు బాల్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ నేవూరి వెంకట నరసింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుల్లపల్లి నరసింహారెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు జబ్బర్, వార్డు సభ్యులు కొత్త చెన్నయ్య, అంగూరి ప్రవీణ్‌కుమార్, లింగపురం ఆంజనేయులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ప్రభుత్వ చెక్కుల పంపిణీ..

**బలగం టీవీ, ముస్తాబాద్:**
పోతుగల్ గ్రామంలో ఆదివారం ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం రూ.2,06,000 విలువైన చెక్కులను 9 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని తమ కుటుంబ అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు.
ప్రభుత్వ సహాయం పొందిన లబ్ధిదారులు..బండారి బాలయ్య-రూ.40,000, పుట్టలక్ష్మి-రూ.25,000, వంగ లక్ష్మి-రూ.25,000, జంగ రాజనర్సమ్మ-రూ.24,500, నీరటి చంద్రయ్య-రూ.22,500,అనమేని లక్ష్మి-రూ.22,000, వంగపల్లి బాలయ్య-రూ.20,500, చెప్పాలరేఖ-రూ.20,000,తలారిమణమ్మ- రూ.6,500,ఈ కార్యక్రమంలో పోతుగల్ గ్రామ శాఖ అధ్యక్షుడు అనేమేని రాజు, కేశిగాని రాజయ్య, కాంగ్రెస్ పార్టీ ఎన్ఆర్ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, నాయకులు మెరుగు కిరణ్, మా మిండ్ల ఆంజనేయులు, మాచర్ల బాలయ్య, రవి,అనమేని అంజయ్య, గ్రామప్రజలు, కాంగ్రెస్‌కార్యకర్తలు,లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాల్లో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయం..






## వెలిజిపూర్ గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**
ఉన్నత చదువులు చదివి తమ సామజిక బాధ్యతగా గ్రామాల్లో నివసించే పేద ప్రజలకు వైద్యం అందిచడమే లక్ష్యంగా ఉచిత సేవలు చేయడం అభినందనీయమని వెలిజిపూర్ గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ పటేల్ అన్నారు. ఇల్లంతకుంట మండలంలోని వెలిజిపూర్ గ్రామంలో వంశీ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్బంగా ప్రముఖ వైద్యులు డా. నేరెళ్ల వంశీదర్ గౌడ్, కపిల్ సాయి గౌడ్ లు ప్రజలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికీ ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ మెగా వైద్య శిబిరాన్ని తమ గ్రామంలో నిర్వహించినందుకు గ్రామ సర్పంచ్ నవీన్ కుమార్ వైద్య బృందం నకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, మాజి సర్పంచ్ లు, వార్డ్ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ బోనాల పండగ..

**బలగం టీవీ, బోయినిపల్లి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో పద్మశాలి సమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రోజున పోచమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనంతో డప్పు చప్పుల మధ్య, పోచమ్మ ఆలయానికి తరలి వెళ్లారు. అనంతరం పోచమ్మ దేవతకు నైవేద్యం సమర్పించారు. పిల్లాపాపలు చల్లగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని పోచమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పండగ కార్యక్రమంలో సర్పంచ్ నల్లమోహన్, పద్మశాలి సమాజ సేవా సంఘం అధ్యక్షులు బిల్ల మల్లేశం, సంఘ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# మహానగరానికి తాగునీటి గండం

- మహానగరానికి తాగునీటి గండం
- సర్కార్ తీరుతో ముంచుకొస్తున్న ముప్పు
- ఎండిపోతున్న ఎల్లంపల్లి.. అడుగంటిన అన్నపూర్ణ
- ఎడారిని తలపిస్తున్న ఎల్ఎండీ, మిడ్‌మానేరు
- కాళేశ్వరం నీళ్లెత్తుకుంటే గొంతు తడువడం కష్టమే
- ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు తగ్గిన సరఫరా
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో కళకళలాడిన ప్రాజెక్టులు
- రేవంత్ వైఖరితో రాష్ట్రంలో తాగునీటి కటకట



ముమ్ముందు కరెంటు ఉత్పత్తిపైనా తీవ్ర ప్రభావం

**కరీంనగర్, జూలై 19 :** హైదరాబాద్ మహానగరానికి మంచినీటి ముప్పు పొంచిఉన్నది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడం, ప్రభుత్వ మంచి నీటి సరఫరా తగ్గిపోవడంతో నగర ప్రజలు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఈ పరిస్థితి మరింత తీవ్ర రూపం దాల్చనున్నది. దీనికి కారణం మహానగరానికి ఏటా 10 టీఎంసీల మంచినీటిని అందించే ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎండిపోతుండటమే. ఇప్పటికే ఈ ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా తగ్గించారు. మరో వారం పది రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే, ప్రాజెక్టు నుంచి మోటర్లు పెట్టి ఎత్తిపోసే దుస్థితి ఏర్పడనున్నది. ఇప్పటికే హైదరాబాద్ మహానగరానికి సరఫరా అయ్యే నీటి వనరుల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. మరోవైపు, ఎల్లంపల్లిలో అడుగంటుతున్న జలాలు రామగుండం నేషనల్ థర్మల్ పవర్ ప్రాజెక్టుతో (ఎన్టీపీసీ)పాటు రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)ను వణికిస్తున్నాయి. కన్నెపల్లి పంపుహౌస్‌లను ఆన్ చేయకుండా సర్కార్ చూపుతున్న నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా జలసంక్షోభం తలెత్తుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఎండుతున్న ఎల్లంపల్లి

హైదరాబాద్ మహానగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడానికి కృష్ణా, గోదావరి నదులతోపాటు సింగూరు, మంజీరా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌నగర్ నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. ఆయా జలవనరుల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. సింగూరులో నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరడంతో.. నీటిని పంపింగ్ చేయడానికి ప్రత్యేక మోటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తున్నది. గోదావరి నదిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ప్రతి ఏటా 10 టీఎంసీల నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలకు పంపిస్తున్నారు. కేటాయింపు ప్రకారం ప్రతి రోజూ 331 క్యూసెక్కుల నీటిని ఈ ప్రాజెక్టు నుంచి పంపించాల్సి ఉన్నది. ఈ లెక్కన నెలకు 0.86 టీఎంసీ, ఏడాదికి 10 టీఎంసీలు పంపించడానికి కేటాయింపు లున్నాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20.17 టీఎంసీలు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 7 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఇందులో 2.5 టీఎంసీలు డెడ్‌స్టోరేజీ. ఈ ప్రాజెక్టు నుంచి నిత్యం విభిన్న రంగాలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఒక్క హైదరాబాద్‌కు తాగునీటి కోసమే కాకుండా రామగుండం నేషనల్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఎన్టీపీసీ), తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ), రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)తోపాటు మిషన్ భగీరథ కింద కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల తాగునీటి కోసం సరఫరా చేయాల్సి ఉంటుంది. ఏటా ఎన్టీపీసీకి 6.5 టీఎంసీలు, ఆర్ఎఫ్‌సీఎల్‌కు 1 టీఎంసీ, హైదరాబాద్ వాటర్ సరఫరాకు 10 టీఎంసీలు, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, తదితర తాగునీటి అవసరాలకు మిషన్ భగీరథ కింద 1.5 టీఎంసీల కేటాయింపులున్నాయి. వీటితోపాటు తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ) కింద 1,600 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ నడుస్తున్నది. వీటికి 2 టీఎంసీల కేటాయింపులున్నాయి. ఇంత భారం ఉన్నఈ ప్రాజెక్టులో ప్రస్తుత పరిస్థితి దయనీయంగా మారుతున్నది. ఇప్పటికే, హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాలకు మిషన్ భగీరథ కింద నీటిని తీసుకొనే పంపుహౌస్‌ల వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్‌కు వారంలో కొద్ది రోజులు నీటిని తగ్గించి పంపిస్తున్నారు. నిత్యం 331 క్యూసెక్కుల నీటిని పంపించాల్సి ఉండగా, 275 క్యూసె క్కుల నీటిని పం పిస్తున్నారు. అంటే రోజుకు 213.93 మిలియన్ గ్యాలన్ల నీటిని పంపించాల్సి ఉండగా, 177.73 మిలియన్ గ్యాలన్ల నీటిని మాత్రమే పంపిస్తున్నారు. రోజురోజుకూ ఈ సరఫరాలో తగ్గింపు పెరిగే ప్రమాదాలు న్నాయి. ఏటా 10 టీఎంసీల నీటిని హైదరాబాద్‌కు సరఫరా చేయడానికి బ్రాహ్మణపల్లి వద్ద పంపుహౌస్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో 141 మీటర్ల వరకు నీటి నిల్వలుంటేనే ఈ పంపుహౌస్‌కు లక్ష్యం మేరకు నీరు చేరుతుంది. ప్రస్తుతం నీటి నీల్వ 140.3 మీటర్ల లెవల్‌కు పడిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. అప్పుడు ప్రాజెక్టులో రోడ్డు వేసి, 20 మోటర్లు పెట్టి ఎత్తిపోశారు. అయినా డిమాండ్‌కు అనుగుణంగా ఆనాడు సరఫరా లేకపోవడంతో ఆందోళన వ్యక్తమైంది. ఇప్పుడు అదే పరిస్థితి పునరావృతం అవుతున్నది. ప్రస్తుతం ప్రాజెక్టుకు చుక్క ఇన్‌ఫ్లో లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే, కొద్దిరోజుల్లోనే హైదరాబాద్‌కు నీటిని పంపేందుకు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సాగు, తాగునీటిని అందిస్తూ... మరోవైపు ఎత్తిపోతల పథకం కింద కొండపోచమ్మ సాగర్ వరకు నీటిని అందించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా ఉన్నది.

# మహిళా రైతులపై నాన్‌బెయిలబుల్ కేసులు..



## బహదూర్‌గూడ ఘటనలో సర్కార్ మరో దౌర్జన్యం

**హైదరాబాద్, జూలై 19 :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని బహదూర్‌గూడ గ్రామంలో శనివారం జరిగిన ఘటనలో మహిళా రైతులపై పోలీసులు నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. ఈ ఘటనపై రెండు కేసులు నమోదు చేయగా, బీఆర్ఎస్ నేతలతో పాటు 50 మంది ప్రమేయం ఉన్నట్టు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే బహదూర్‌గూడ గ్రామంలోని సర్వే నంబర్ 28, 62లో ఉన్న 650 ఎకరాల భూమిలో కొంతకాలంగా తాము వ్యవసాయం చేసుకుంటున్నట్టుగా రైతులు చెప్తున్నారు. కాగా, ఇది ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర సర్కార్ కేటాయించింది. దీనిని ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. బాధిత రైతులు కొంతకాలంగా ఆ ప్రదేశంలో దీక్షకు దిగారు. శనివారం తెల్లవారుజామున ఈ దీక్షా శిబిరాన్ని ఎత్తివేసేందుకు పోలీసులు యత్నించగా, రైతులు అడ్డుకున్నారు. దీంతో రైతులు ఎదురుతిరుగగా, పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. కాగా, బహదూర్‌గూడ, లక్ష్మీతండాకు చెందిన జటావత్ రవీందర్, జటావత్ కమ్లీ, జటావత్ మణి, గాయత్రి, మెగావత్ నీలమ్మ, ఎలుకని జ్యోతి, దేవేందర్‌తో పాటు మరికొంతమందిపై సెక్షన్ 133, 308-2, 121-1, బీఎన్ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. క్రైం నంబర్ 401లో భాగంగా కేసులు నమోదు చేశారు. కార్తీక్‌రెడ్డితో పాటు మరో 35మందిపై కేసు నమోదు చేశారు.
**మరో కేసులో..**మరో ఘటనలో క్రైం నంబర్ 400లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు కార్తీక్‌రెడ్డితో పాటు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లయ్య, ఆ పార్టీ నాయకులు చిలుకమర్రి నర్సింహ, పంతంగి భూపాల్‌గౌడ్, మహేందర్, కొలను ప్రదీప్‌రెడ్డి, యాదగిరి, రాహుల్, మహేందర్ యాదవ్, పరమేశ్వరి, వేణుగౌడ్, హరిప్రసాద్, జనార్దన్‌యాదవ్, భిక్షపతియాదవ్, యాదయ్య, శంకరమ్మ, పార్వతమ్మ, సుధా, మీనా, సరస్వతి, సుమలత, భాగ్య, యాదమ్మ, చంద్రయ్య, మహేశ్వర్‌రెడ్డి, కొర్ర దినేశ్, నర్సింగ్‌రాజు, క్యామ శ్రీకాంత్, వట్టపల్లి శ్రీనివాస్‌నాయక్, విజయ్‌కుమార్, ఏర్పుల ప్రభాకర్, వెంకటేశ్‌గౌడ్, శ్రీకాంత్, సురేందర్, మహేందర్‌పై సెక్షన్ 170తో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు. దీంతోపాటు మరికొంతమందిపై కూడా అనుమానితులుగా కేసులు నమోదు చేశారు. తమ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా తమ కండ్లల్లో కారం చల్లి, కుర్చీలు, రాళ్లు, రాడ్లతో దాడి చేశారని శంషాబాద్ ఎస్సై వనజ ఫిర్యాదు చేశారు. మరో కేసును విజయ్ అనే పోలీసు ఫిర్యాదు మేరకు నమోదు చేశారు. తమ భూముల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిని రెచ్చగొట్టి తమపైనే కేసులు నమోదు చేయడంపై రైతులు మండిపడుతున్నారు.

# నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్..

## సూర దేవరాజు

**బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల:** ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ఎఫ్) ఒక గొప్ప సంక్షేమ పథకమని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. పట్టణానికి చెందిన సుల్తాన్ లచ్చయ్య 60,00 రూపాయలు, మద్దిరాల ప్రతాప్‌కు 17500, సదుల లలిత 26000 రూపా యల విలువైన చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. సూర దేవరాజు మాట్లాడుతూ.. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుం బాలకు ఈ పథకం ఎంతో మేలు చేకూరుస్తుందని కొనియాడారు. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని అంది స్తూ, పేద బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన తెలంగాణలో కాం గ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 500 రూపాయలకే సిలిండర్ 200 యూనిట్ వరకు కరెంట్ బిల్లు ఉచితం పేద బడుగు బలహీన వర్గాల కోసం ఉచిత రేషన్ షాప్ దార ఉచిత గా సన్న బియ్యం రైతులకు గిట్టుబాటు ధర ఉద్యోగులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభు త్వానికి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంటెస్టెడ్ కౌన్సిలర్ సూర నిర్మల,, కోడం నాగభూషణం, కత్తెరపాక ఎల్లయ్య, కోలకని రాజేశం, అనవేని మల్లేశం,తడుక వెంకటేశం సదుల గంగాధర్, ఎండి కలీం, అబ్బగోని లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ రాయితీ మాయాజాలం

- జర్నలిస్టుల జేబులకు చిల్లు !
- 1/3 రాయితీకి మంగళం.. సగం ధరకంటే ఎక్కువే వసూలు
- ఎక్స్‌ప్రెస్‌లో 55శాతం, ఎలక్ట్రిక్ బస్సుల్లో 60శాతం బాదుడు
- బస్సు పాస్‌లో ఒకటి.. టికెట్ మిషన్‌లో మరొకటి !
- సాఫ్ట్‌వేర్ సాకుతో అదనపు వసూళ్లు.. బెంబేలెత్తుతున్న విలేకరులు

**హైదరాబాద్, జూలై 19:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సమాజ హితం కోసం అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకి ఆర్టీసీ షాక్ ఇస్తోంది. జర్నలిస్టులకు ఇచ్చే ప్రయాణ రాయితీల్లో నిశ్శబ్దంగా కోత విధిస్తూ, వారిపై అదనపు భారాలు మోపుతోంది. గతంలో అమలైన 1/3 (మూడో వంతు) రాయితీని కాగితాలకే పరిమితం చేస్తూ, క్షేత్రస్థాయిలోసగంకంటే ఎక్కువ ధరను వసూలు చేస్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేట్ అక్రిడిటేషన్ నిబంధనల ప్రకారం జర్నలిస్టులకు టికెట్ ధరలో కేవలం 33 నుండి 35 శాతం మాత్రమే వసూలు చేయాలి. కానీ, ప్రస్తుతం ఆర్టీసీ దాదాపు 50 శాతం (1/2 ధర) కంటే ఎక్కువే వసూలు చేస్తోం ది. బస్సు పాస్‌ల మీద స్పష్టంగా 1/3 రాయితీ అని ముద్రిస్తున్న అధికారులు, టికెట్ ఇష్యూయింగ్ మిషన్లలో (టిమ్స్) మాత్రం ఆ మేరకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకపోవడమే ఈ దోపిడీకి కారణమని తెలుస్తోంది.

## ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ బస్సుల్లో చుక్కలు....

సాధారణ పల్లె వెలుగు బస్సుల కంటే ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సర్వీసుల్లో జర్నలిస్టులకు రాయితీ భారం భారంగా మారింది. ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో వీటిలో జర్నలిస్టుల నుంచి ఏకంగా 53 శాతం నుండి 55 శాతం వరకు టికెట్ ధర వసూలు చేస్తున్నారు. అంటే రాయితీ 50 శాతం కూడా ఉండటం లేదు. ఎలక్ట్రిక్ బస్సుల్లో పర్యావరణ హితం పేరిట వచ్చిన ఈ బస్సుల్లో జర్నలిస్టులకు అసలైన షాక్ తగులుతోంది. ఇక్కడ ఏకంగా 60 శాతం ధర వసూలు చేస్తూ, కేవలం 40 శాతం రాయితీతోనే సరిపెడుతున్నారు.
బస్సుల్లో రాయితీపై కండక్టర్లను ప్రశ్నిస్తే.. మేమేం చేయలేం.. మిషన్లలో (టిమ్స్) ఫీడింగ్ ఎలా ఉంటే అలాగే టికెట్ వస్తుందని వారు చేతులెత్తేస్తున్నారు. రాయితీ లెక్కల్లో స్పష్టత లేకపోవడంతో నిరంతరం జర్నలిస్టులకు, కండక్టర్లకు మధ్య వాగ్వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. దూరాన్ని బట్టి లెక్కించాల్సిన రాయితీలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వార్తల సేకరణ కోసం జిల్లా కేంద్రాలకు, ఇతర పట్టణాలకు నిరంతరం ప్రయాణించే విలేకరులకు ఈ టికెట్ భారం గుదిబండగా మారింది. అతి తక్కువ జీతాలతో పని చేసే జర్నలిస్టులు, తమ సంపాదనలో ఎక్కువ భాగం ప్రయాణాలకే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## జర్నలిస్టు సంఘాల డిమాండ్..

ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించి అన్ని రకాల బస్సుల్లో (ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సహా) పాత పద్ధతిలో మూడోవంతు రాయితీని పక్కాగా అమలు చేయాలని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. యూజర్ చార్జీల నుంచి జర్నలిస్టులకు మినహాయింపు ఇవ్వాలని, టికెట్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ లోపాలను సరిదిద్దాలని కోరుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు స్పందించి ఈ రాయితీ కోతకు అడ్డుకట్ట వేయాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

## బహదూర్‌గూడలో మరోసారి ఉద్రిక్తత..

చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.రైతులకు మద్దతుగా పలువురు రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు గ్రామానికి చేరుకొనే ప్రయత్నం చేయగా, పోలీసులు వారిని సైతం అడ్డుకొన్నారు. తమ అభిప్రాయాలు తెలుసుకోకుండా సరైన పరిహారం. పునరావాసంపై స్పష్టత ఇవ్వకుండా భూములు స్వాధీనం చేసుకోవడం సరికాదని రైతులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చర్చలు జరిపి తమకు సరైన పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. భూసేకరణ అంశంతో బహదూర్‌గూడలో రోజంతా ఉత్కంఠ వాతావరణం కొనసాగగా, పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించారు.

## సీఎం రేవంత్‌రెడ్డి వల్లే కరువొచ్చింది

గుర్తుచేశారు. ఆ రోజుల్లో వానల కోసం దేవుండ్లను వేడుకొనే పరిస్థితి ఉండేది కాదని చెప్పారు. 'గోదావరి నీళ్లొస్తే చాలు.. చెరువులు నిండేవి, కాలువలు పారేవి, పంటలు పండేవి. గడిచిన ఆరేండ్లలో కరువు అనే మాట రైతు నోట వినిపించలేదు' అని పేర్కొన్నారు. వేసవిలో కూడా చెరువులు అలుగులు తొకాయని, రెండు పంటలు కాదు.. మూడు పంటలను కూడా రైతులు సాగు చేశారని చెప్పారు.కన్నెపల్లి బరాజ్ నుంచి తక్షణమే కాళేశ్వరం నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలనే ప్రధాన డిమాండ్‌తో ఆదివారం సిద్దిపేట జిల్లా అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్ రిజర్వాయర్ వరకు బీఆర్‌ఎస్ పార్టీ చిన్నకోడూరు మండల కమిటీఆధ్వర్యంలో 16కిలోమీటర్లదాకారైతులు చేపట్టిన పాదయాత్రకు విశేషస్పందన వచ్చింది.

## సాగునీటి సంస్థల బలోపేతానికి కొత్త కార్యాచరణ

రుణాలు, నిధుల లభ్యత, పనుల పురోగతిపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. తక్కువ పెట్టుబడితో త్వరగా పూర్తయ్యే ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని, శాఖకు చెందిన భూములు, ఇతర ఆస్తుల వివరాలను 15 రోజుల్లో సిద్ధం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న చట్టబద్ధ ఆడిట్లను పూర్తి చేయాలని... భూసేకరణ పరిహారాన్ని రైతులకు ఆలస్యం లేకుండా చెల్లించాలని మంత్రి ఆదేశించారు.

## నిజామాబాద్ జిల్లాలో హై టెన్షన్..

పోలీ సులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆర్మూర్ పరిధిలో భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 163 అమలు చేస్తూ ఆంక్షలు విధించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వినయ్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి పిలుపునిచ్చిన పలువురు కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల ఆంక్షల నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.ఇదిలా ఉండగా, అంకాపూర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పార్టీ శ్రేణులతో సమావేశమై పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఆయన ఇంటి వద్ద భారీ సంఖ్యలో పోలీసులు మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. గ్రామంలోకి వచ్చే మార్గాల వద్ద కూడా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ కార్యక్రమాల నేపథ్యంలో అంకాపూర్ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి.

## కుంటుపడిన నగర ప్రగతి :

సీఎం రేవంత్‌రెడ్డికి హిట్లర్ అంటే ఇష్టమని, అందుకే ఆయన పాలన కూడా హిట్లర్ తరహాలోనే సాగుతున్న దని చురకలంటించారుహైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేస్తూ వారిమీద గునపం ఎక్కుపెట్టారని మండిపడ్డారు. వర్షాకాలం వచ్చినా నగరంలో ప్రజలకు కనీసం తాగునీరు అందడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు.

## బీఆర్‌ఎస్‌కు మల్లారెడ్డి గుడ్‌బై?

సభలో రేవంత్ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై తీవ్ర విమర్శలు చేస్తున్నా పట్టించుకోలేదు. సభ ముగిసిన తర్వాతనైనా, కనీసం మరుసటి రోజైనా (ఆదివారమైనా) రేవంత్ విమర్శలను మల్లారెడ్డి ఖండించలేదు. దీంతో బీఆర్‌ఎస్ శ్రేణులు ఆవేదన చెందాయి. తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేగా పాల్గొన్నారనుకున్నా.. సీఎం విమర్శలపై ప్రైవేటుగానైనా స్పందించలేదని మల్లారెడ్డిపై బీఆర్‌ఎస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశాయి.మల్లారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలంటూ బీఆర్‌ఎస్ క్యాడర్ డిమాండ్ చేసింది. మరోవైపు 'ఇప్పుడు ఏం బ్లాక్‌మెయిల్ చేశాడని సైలెంట్ అయినవ్ మల్లన్నా?' అంటూ బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ ప్రశ్నించారు. ఈ పరిణామాల తరువాత కూడా మల్లారెడ్డి స్పందించకపోవడంతో ఆయన బీఆర్‌ఎస్‌లో ఉన్నట్లా? లేనట్లా? అన్న చర్చ మొదలైంది. వాస్తవానికి మల్లారెడ్డిపై మేడ్చల్ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గతంలోనే పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పార్టీ కార్యకలాపాలకు ఆయన దూరంగా ఉండడంతోపాటు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కూడా హాజరు కావడంలేదు. దీంతో ఈ బాధ్యతలను వీలైతే ఇంకెవరికైనా అప్పగిస్తే మంచిదని వారు కోరారట.

## రాజకీయాలపై కార్టూన్లు చూపే ప్రభావం

'ఒక చిత్రం వెయ్యి పదాలతో సమానం' అనే సూక్తిని ప్రస్తావిస్తూ, సమాజం, రాజకీయాలపై కార్టూన్లు చూపే ప్రభావం ఎంతో గొప్పదని అన్నారు. భారతదేశంలో ఆర్.కే. లక్ష్మణ్ వంటి మహోన్నత కార్టూనిస్టులు చూపిన మార్గం చిరస్మరణీయమని, అంతర్జాతీయంగా బిల్ వాటర్సన్ సృష్టించిన క్యాల్విన్ అండ్ హాబ్స్ తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. తెలుగులో ఈనాడు శ్రీధర్, సాక్షి శంకర్ వంటి కార్టూనిస్టుల ప్రతిభను ప్రశంసించారు.

## పట్టణాలకు లక్షఎల్‌ఐజీ ఇండ్లు..

తెలిపారు.ఇదే ఏడాది గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షలు ఇండ్ల నిర్మాణాలు చేపడుతామని చెప్పారు. పట్టణాల్లో క్యూర్ పరిధిలో చేపట్టే ఇండ్ల కార్యక్రమాన్ని సోమవారం శ్రీకారం చుట్టనున్నట్టు చెప్పారు. ఆదివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించిన ప్రభుత్వం, ప్రస్తుతం హైదరాబాద్ నగరంతోపాటు పట్టణ ప్రాంతాలకు ప్రాధాన్యం కల్పించనున్నట్టు చెప్పారు.

## భవిష్యత్ పరిణామాలకు మీదే బాధ్యత - హరీష్ హెచ్చరిక..!!

**హైదరాబాద్, జూలై 19:**
బీఆర్‌ఎస్ నేత.. మాజీ మంత్రి హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేసారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వద్ద మోటార్లు ఆన్ చేసి.. రైతన్నకు సాగు నీరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రాజకీయం కోసం లక్షలాది మంది రైతుల ఉసురు పోసుకోవద్దంటూ ప్రభుత్వానికి హితవు పలికారు. నీళ్లు లేకుంటే విద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏర్పడే తీవ్ర పరిణామాలకు నీదే బాధ్యత అంటూ ముఖ్యమంత్రి రేవంత్ ని హరీష్ హెచ్చరించారు. మాజీ మంత్రి హరీష్ సీఎం రేవంత్ లక్ష్యంగా ఆసక్తి కర వ్యాఖ్యలు చేసారు. ప్రతి చుక్కని పట్టిసీమ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒడిసి పడుతుందని గుర్తు చేశారు. రైతులకు నీళ్లు ఇవ్వమంటే బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను తిడుతున్నారని కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డారు. గోదావరి జలాలు వచ్చినవి వచ్చినట్లు కిందకి వదులుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాల కోసం రాష్ట్ర భవిష్యత్తును పణంగా పెడుతున్నారంటూ సీఎం రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేసారు. కేసీఆర్‌ను తిడితే నీళ్లు రావని.. మోటార్లు ఆన్ చేస్తే నీళ్లు వస్తాయని వ్యాఖ్యానించారు. భద్రాచలం కొట్టుకుపోతుందంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అర్ధరహితమని అన్నారు. రైతుల కంటే తనకు ఏదీ ముఖ్యం కాదని హరీష్ చెప్పుకొచ్చారు. తనను కావాలంటే కోయాలని.. రైతులకు మాత్రం నీళ్లు వదలాలని కోరారు. రేవంత్ నీళ్లు ఇవ్వడం ఇష్టం లేక ఆయన అలా మాట్లాడుతున్నారని చెప్పారు. భేషజాలకు పోవద్దంటూ సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. అన్ని రిజర్వాయర్లు నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 60 శాతం తెలంగాణకు సాగు నీరు ఇచ్చే అవకాశం ఉందని వివరించారు. రైతులకు నీళ్లు ఇచ్చే దాక ప్రభుత్వాన్ని వదిలిపెట్టమని మాజీ మంత్రి హరీశ్ రావు హెచ్చరించారు. చిన్నకోడూరు మండలం అన్నపూర్ణ రిజర్వాయర్ (అల్లీపూర్) వద్ద నుంచి రంగనాయకసాగర్ వరకు రైతుల పాదయాత్ర కొనసాగుతోంది. 16 కిలో మీటర్ల మహాపాదయాత్రలో వేలాది మంది రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

# "వందేమాతరం పాడకపోతే మూడేళ్ల జైలు శిక్ష"

**న్యూఢిల్లీ, జూలై 19 :** జాతీయ గేయం వందేమాతరంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వందేమాతరం గేయాన్ని అవమానించినా.. ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా తీవ్ర నేరంగా పరిగణించనుంది. అలాగే వందేమాతరాన్ని అవమానిస్తే మూడేళ్ల జైలుశిక్ష విధిస్తామని కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు పార్లమెంట్ లో బిల్లును ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ హానర్' బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టనున్నారు. జూలై 20, సోమవారం నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభంగానున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సమావేశాల్లో తొలిరోజే ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టి, ఆ తర్వాత



లోక్ సభలో ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం అవుతోంది. ఈ బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ హానర్ (సవరణ)–2026 పేరుతో ఓ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం అమలులో ఉన్న 1970 నాటి చట్టం ప్రకారం.. జాతీయ గేయం, జాతీయ గీతం, జాతీయ పతాకాన్ని అవమానించడం చట్టరిత్యా నేరం. దీనికి మూడేళ్లపాటు జైలు శిక్ష లేదా జరిమానా, లేదంటే రెండూ విధించే నిబంధన ఉంది. తాజాగా ఈ చట్టానికి సవరణ చేయడం ద్వారా ఆ జాబితాలో 'వందేమాతరం' గేయాన్ని చేర్చనున్నారు. తాజా నిబంధన ప్రకారం ఎవరైనా వందేమాతరం ఆలపించడాన్ని అడ్డుకున్నా లేదా అవమానపరిచే చర్యలకు పాల్పడినా మూడేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుంది. ఇక భారత స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం గేయం కీలక పాత్ర పోషించింది.

ఈ గేయాన్ని బంకీం చంద్ర ఛటోపాధ్యాయ రచించారు. ఇది ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో తొలిసారి ప్రచురితమైంది. ఈ గేయానికి 1950లో రాజ్యాంగ పరిషత్ 'జాతీయ గేయం' హోదాను కల్పించింది.

## నీటిని ఆదా చేసే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి..

### - మండల వ్యవసాయ అధికారి లక్ష్మణ్



**బలగం టీవీ, బోయినిపల్లి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మణ్ పర్యటించి, ఎల్నినో ప్రభావం వల్ల నీటి వనరుల తగ్గుదల గమనించి, ప్రస్తుత పరిస్థితులను అనుగుణంగా రైతు సోదరులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వల్ల భూగర్భ జలాలు తగ్గు ముఖం పట్టాయని, బోరు, బావులు నీటిమట్టం తగ్గుతున్నాయని అలాగే చర్యలు పూర్తిస్థాయిలో పంటలు పండించే పరిస్థితి కనిపించడం లేదని, చివరి దశలో వర్షాలు వచ్చినా కూడా చెరువులు పూర్తిగా నిండే అవకాశం తక్కువ ఉందని అన్నారు. అందువల్ల రైతులు మొత్తం విస్తీర్ణం చేయకుండా, కొంత భాగంలో తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలైన జొన్న, పెసర, మినుము, కంది, పొద్దుతిరుగుడు, ఆముదం లాంటి పంటలను సాగు చేయాలని సూచించారు. అంతేకాకుండా రాబోయే రోజుల్లో బోర్లు, చెరువుల ద్వారా నీటి లభ్యత మరింత తగ్గే అవకాశం ఉన్నందున నీటిని ఆదా చేస్తూ ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి, పెట్టుబడి తగ్గించుకుని, నష్టాలను తగ్గించుకోవాలని కోరారు. అలాగే మన వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎల్.ఆర్.జి 52 అనే రకం కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో లక్ష్మణ్ కోరారు.

# విక్రమ్--1 విజయగాథలో సిరిసిల్ల యువతేజాలు..

### ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఇంజనీర్లు అంతర్జాతీయ అంతరిక్ష వేదికపై సత్తా చాటారు..

బలగం టీవీ, సిరిసిల్ల:
భారత ప్రైవేట్ అంతరిక్ష రంగ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిన విక్రమ్--1 ఆర్బిటల్ ప్రయోగ వాహక విజయగాథలో సిరిసిల్లకు చెందిన ముగ్గురు యువ ఇంజనీర్లు కీలక పాత్ర పోషించడం జిల్లా ప్రజలకు గర్వకారణంగా నిలిచింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి విజయవంతంగా ప్రయోగించిన స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ రూపొందించిన తొలి ఆర్బిటల్ రాకెట్ విక్రమ్--1 విజయానికి సిరిసిల్ల పట్టణానికి చెందిన అడుప సంతోష్ కుమార్, అడుప కిరణ్, బొమ్మదేని నాగరాజు తమ ప్రతిభతో విశేషంగా దోహదపడ్డారు.ఒకే కుటుంబానికి చెందిన ఈ ముగ్గురు యువ ఇంజనీర్లు భారత అంతరిక్ష రంగంలో తమ సాంకేతిక నైపుణ్యాన్ని చాటుతూ, సిరిసిల్ల ఖ్యాతిని దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ వేదికపై మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు.ఈ ప్రయోగంలో అడుప సంతోష్ కుమార్ అవియానిక్స్ చెక్‌అవుట్ లీడ్గా బాధ్యతలు నిర్వహిస్తూ రాకెట్ అవియానిక్స్ వ్యవస్థల తనిఖీలు, పరీక్షలు, ప్రయోగానికి ముందు నిర్వహించే కీలక గ్రౌండ్ చెక్‌అవుట్ కార్యకలాపాలకు నాయకత్వం వహించారు.అడుప కిరణ్ రాకెట్ జూణ డిజైనర్గా రాకెట్ రూపకల్పన, సాంకేతిక డిజైన్ పనుల్లో కీలక బాధ్యతలు నిర్వహించి విజయానికి తన వంతు సహకారం అందించారు.అలాగే బొమ్మదేని నాగరాజు ఎలక్ట్రికల్ ఇంటిగ్రేషన్ ఇంజనీర్గా రాకెట్ విద్యుత్ వ్యవస్థల సమీకరణ, సమన్వయ



ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించి ప్రయోగ విజయానికి తోడ్పడ్డారు.భారత ప్రైవేట్ అంతరిక్ష రంగ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన విక్రమ్--1 తొలి ప్రయోగం విజయవంతం కావడం దేశానికి గర్వకారణమైతే, ఆ విజయగాథలో సిరిసిల్లకు చెందిన ముగ్గురు యువ ఇంజనీర్లు భాగస్వాములు కావడం జిల్లా ప్రజలకు మరింత ఆనందాన్ని కలిగించింది.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, యువత ఆ ముగ్గురు ఇంజనీర్లను అభినందిస్తూ, వారి విజయం సిరిసిల్ల యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కృషి, పట్టుదల, ప్రతిభ ఉంటే ప్రపంచ స్థాయిలోనూ రాణించవచ్చని వారు నిరూపించారని కొనియాడారు.విక్రమ్--1 విజయగాథలో సిరిసిల్ల యువతేజాల ప్రతిభ భారత అంతరిక్ష చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుందని జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బండి, ఈటెల సయోధ్య పై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు..!!

ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేసారు. తెలంగాణ బీజేపీలో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాల పైన స్పందించారు. పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ సమక్షంలో ఈటల – బండి సంజయ్ సయోధ్య పైన ప్రశ్నలు లేవెనెత్తారు. గ్రేటర్ పరిధిలోని మూడు కార్పోరేషన్లలో బీజేపీ గెలుస్తుందా అని ప్రశ్నించారు. ఒక్క కార్పోరేషన్ లో సగం సీట్లయినా గెలుస్తుందా అని సందేహం వ్యక్తం చేసిన రాజాసింగ్.. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి పైన ఆసక్తి కర విశ్లేషణ చేసారు. తెలంగాణ బీజేపీ నేతల మధ్య సమన్వయం కోసం పార్టీ నాయకత్వం నేరుగా రంగంలోకి దిగింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ సమక్షంలో బీజేపీ నేతలు ఎంపీ ఈటల రాజేందర్, కేంద్రమంత్రి బండి సంజయ్ ల సయోధ్య కుదిరింది. ఇద్దరూ గతం మరిచి పార్టీ కోసం పని చేస్తారని ప్రకటన చేసారు. ఈ పరిణామం పై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వీరిద్దరు కలవడం పార్టీ పరంగా మంచి పరి



ణామమేనని పేర్కొన్న ఆయన, అంత మాత్రాన తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేస్తుందా? అంటూ కొత్త చర్చ లేవనెత్తారు. పార్టీలో కొందరు నేతలు కలివటం వలన అధికారం రాదని వ్యాఖ్యానించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులు.. కేడర్ అభిప్రాయాల తో పాటుగా ప్రజల పక్షాన నిలబడితేనే ప్రయోజనం ఉంటుందని చెప్పుకొచ్చారు. త్వరలో గ్రేటర్ పరిధిలో ఎన్నికలు జరగనుండటంతో రాజాసింగ్ ప్రస్తుత పరిస్థితి పైనా స్పందిస్తూ అసంతృప్తి వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం పార్టీ ఎంత బలంగా ఉందో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో బలాన్ని పెంచుకోకుండా కేవలం భేటీలకే పరిమితమైతే లాభం లేదని పేర్కొన్నారు. గ్రేటర్ పరిధిలో జరిగే మూడు కార్పోరేషన్ల మేయర్ పదవులు గెలుస్తామ ని పార్టీ నేతలు చెబుతున్నారని.. మూడు కాదు, ముందు ఒక్కటైనా గెలిచి చూపించండి అంటూ సవాల్ చేసారు.

క్షేత్ర స్థాయిలో వాస్తవాలను గ్రహించి, అతివిశ్వాసానికి పోకుండా పార్టీని బలో పేతం చేయడంపై దృష్టి పెట్టాలని రాజాసింగ్ సూచించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రామచంద్రరావు చేతులు కట్టేసి.. ఆయనను పని చేయటమంటే ఎలా చేస్తారని ప్రశ్నించారు.